సాక్షి
కాకినాడ

గురువారం | 29 | ఆగస్టు | 2024



నిత్యాన్నదాన ట్రస్టుకు విరాళం

సఖినేటిపల్లి: అంతర్వేది లక్ష్మీనృసింహుని ఆలయంలోని నిత్యాన్నదాన ట్రస్టుకు తాడేపల్లిగూడేనికి చెందిన కలిశెట్టి వెంకటేశ్వరరావు, రామలక్ష్మి దంపతులు బుధవారం రూ.50,001 విరాళం అందజేశారు.




ఆటంకాలెన్నో..

మన క్రీడాకారులు అంతర్జాతీయంగా రాణించడానికి అనేక ఆటంకాలు ఎదురవుతున్నాయి. ఫ్రాన్స్ ఒలింపిక్స్‌లోఆరు పతకాలే వచ్చాయి.

8లో

సముద్రంలోకి 3.73 లక్షల క్యూసెక్కులు



ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి బుధవారం సాయంత్రం 3,73,555 క్యూసెక్కుల మిగులు జలాలను సముద్రంలోకి విడుదల చేశారు. బ్యారేజీ వద్ద నీటిమట్టం 10.50 అడుగులకు చేరింది. ఖరీఫ్ సాగుకు సంబంధించి డెల్టా కాలువలకు 12,300 క్యూసెక్కుల నీటిని వదిలారు.

న్యూస్‌రీల్

ఈవీఎం, వీవీప్యాట్ గోదాముకు పటిష్ట భద్రత

కాకినాడ సిటీ: ఈవీఎం, వీవీప్యాట్ (ఎలక్ట్రానిక్ ఓటింగ్ మెషీన్ల)లకు పటిష్ట భద్రత ఏర్పాటు చేయాలని కలెక్టర్ షణ్మోహన్ అధికారులను ఆదేశించారు. బుధవారం కాకినాడ కలెక్టరేట్ వద్ద ఉన్న ఈవీఎం, వీవీప్యాట్ గోదామును జిల్లా కలెక్టర్ రెవెన్యూ, ఎన్నికలు, అగ్నిమాపక శాఖల అధికారులతో కలిసి పరిశీలించారు. ఈవీఎంల రక్షణ, భద్రతకు సంబంధించి చేపడుతున్న ఏర్పాట్లను తనిఖీ చేసి అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఎన్నికల సంఘం మార్గదర్శకాల మేరకు ప్రతి నెలా ఈవీఎం, వీవీ ప్యాట్ గోదామును తనిఖీ చేసి సమగ్ర నివేదికను పంపిస్తున్నట్లు వెల్లడించారు. జిల్లా రెవెన్యూ అధికారి డి తిప్పేనాయక్, కాకినాడ అర్బన్ తహసీల్దార్ వి జితేంద్ర, కలెక్టరేట్ ఎన్నికల డిప్యూటీ తహసీల్దార్ ఎం జగన్నాథం పాల్గొన్నారు.

డీఎంహెచ్‌వో అధికారులపై విచారణ ప్రారంభం

కాకినాడ క్రైం: పలు అవినీతి అంశాల నేపథ్యంలో డీఎంహెచ్‌వో కార్యాలయంలో పనిచేస్తున్న ముగ్గురు అధికారులపై బుధవారం విచారణ ప్రారంభమైంది. డీసీహెచ్ఎస్ డాక్టర్ స్వప్న విచారణాధికారిగా వ్యవహరించారు. తొలి రోజు ఫిర్యాదుదారుడు ఫణీశ్వర్ హాజరుకాగా, ఆయన నుంచి ఫిర్యాదులో పేర్కొన్న ఆరోపణలకు సంబంధించిన వివరాలు సేకరించారు. సదరు అంశాలపై లోతైన విచారణ చేపట్టనున్నారు.

రేపు వన మహోత్సవం

కాకినాడ సిటీ: జిల్లా స్థాయి వన మహోత్సవం కాకినాడ జేఎన్టీయూలో శుక్రవారం నిర్వహించనున్నట్లు జిల్లా అటవీ అధికారి ఎస్ భరణి తెలిపారు. జిల్లా అటవీ శాఖ ఆధ్వర్యంలో జరిగే ఈ కార్యక్రమంలో పాఠశాల, కళాశాల విద్యార్థులను భాగస్వామ్యం చేస్తూ కాకినాడ జేఎన్టీయూలో వివిధ ప్రాంతాలతో కలిసి 3,000 మొక్కలు నాటుతామని డీఎఫ్‌వో తెలిపారు. అదే రోజు రంగరాయ మెడికల్ కాలేజీ గ్రౌండ్‌లో 1,750 మొక్కలతో పాటు తుని మండలంలోని ఆరు గ్రామాల్లో 1,100 మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టనున్నట్లు ఆమె తెలిపారు. మొక్కలు నాటే కార్యకలాపాలు, ఇతర అవగాహన కార్యక్రమాలు ఈ నెల పొడవునా నిర్వహిస్తామని చెప్పారు.

ఆర్థిక పరిపుష్టి పెరిగేలా దృష్టి

ఐదో ఆర్థిక కమిషన్ చైర్‌పర్సన్ రత్నకుమారి

కాకినాడ: నగరపాలక సంస్థలు, మున్సిపాలిటీలు, పంచాయతీల ద్వారా ప్రజలకు మెరుగైన సేవలతోపాటు ఆర్థిక పరిపుష్టి సాధించేలా మెరుగైన పాలన సాగించాలని ఐదో ఆర్థిక సంఘ కమిషన్ చైర్మన్ ఎస్.రత్నకుమారి కోరారు. బుధవారం ఆమె కమిషన్ సభ్యులతో కలిసి కాకినాడ నగరపాలక సంస్థ కార్యాలయానికి విచ్చేశారు. ఈ సందర్భంగా పలు మున్సిపాలిటీలు, నగరపాలక పంచాయతీల కమిషనర్లతో ఆమె సమావేశమయ్యారు. పన్నులు నూరు శాతంఎలా వసూలు చేయవచ్చు? పెండింగ్ బకాయిలు ఎలా వసూలు చేయాలి? ఆదాయమార్గాలు ఎలా సమకూర్చుకోవాలి? ఆర్థిక పరిపుష్టికి ఎటువంటి చర్యలు తీసుకోవాలనే అంశాలపై సూచనలు ఇచ్చారు. ఈ సందర్భంగా ఆస్తి, ఇంటి, ఖాళీ స్థలాలపై పన్నులు, ప్రకటనలు ఆదాయంపై సమీక్షించారు. నగరపాలక సంస్థ కమిషనర్ భావన ఇక్కడి ప్రగతిని వివరించారు. కమిషన్ సభ్యులు కె.వి.రమణారెడ్డి, ఎం.ప్రసాదరావు, ఎంపీఎస్ పద్మారావు, కె.కృపారావు, డిప్యూటీ కమిషనర్ గుంటూరు శేఖర్, ఈఈ మాధవి, ఎంహెచ్‌వో డాక్టర్ పృథ్వీచరణ్, ఏసీపీ నాగ శాస్త్రులు పాల్గొన్నారు.

ఇలా జరగడం దారుణం



మన దేశంలో ఆడపిల్లలను దేవతామూర్తులుగా పూజిస్తారు. అటువంటి వారిపై దాడులు చేసే ముందు ఒక్కసారి ఆలోచించాలి. నిర్భయ, దిశ ఘటనలు జరిగినా కళ్లు తెరవలేదు. దాంతో నేర స్వభావం కలిగిన వారిలో ధైర్యం పెరిగింది. ఎలాంటి నేరం చేసినా శిక్షలు పడవన్న నమ్మకం కలిగింది. అందుకే ఎక్కడపడితే అక్కడ లైంగిక దాడులు, హత్యలు జరుగుతున్నాయి. కోల్‌కతాలో జరిగిన ఘటన దీనికి పరాకాష్ట. సభ్య సమాజం భయంతో వణికిపోయేలా దోషులు కిరాతకానికి పాల్పడ్డారు. ఘటన జరిగి ఇన్ని రోజులు కావస్తున్నా ఇంకా దోషులను పట్టుకోలేకపోయారు. ఇప్పటికైనా కళ్లు తెరచి కఠిన చట్టాలు చేయాలి.

– డాక్టర్ దీప, ఇండియన్ డెంటల్ అసోసియేషన్ సభ్యురాలు, కాకినాడ




నిందితుల తరఫున 21 మంది లాయర్లా..!



మానప్రాణాలు పోగొట్టుకున్న మృతురాలికి న్యాయం కోసం ఓ సీనియర్ లాయరు, నలుగురు జూనియర్ లాయర్లు పనిచేస్తుంటే, దారుణానికి ఒడిగట్టిన నిందితుల తరఫున 21 మంది ఉద్దండులు వాదిస్తుండడం విస్మయానికి గురి చేస్తోంది. పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి నిరసన కారులతో కలిసి చేసున్న నిరసనల్లో ఎటువంటి నిజాయితీ లేదు. ఇది ఓ తప్పించుకునే ధోరణి. ఆర్ఎంసీ జూడా తరఫున మునుపెన్నడూ లేనంత దీటుగా నిరసనలు మిన్నంటాయి. మృతురాలి కుటుంబానికి న్యాయం జరిగి, నిందితులకు కఠిన శిక్ష పడే వరకూ ఆమె ప్రతిరూపాలుగా మేమంతా పోరాడుతాం.

– డాక్టర్ భవ్య, పీజీ అప్తమాలజీ, చీఫ్ ఎగ్జిక్యూటివ్ మెంబర్, ఆర్ఎంసీ–జూడా

టార్గెట్.. రియల్ ఎస్టేట్



- కూటమి నేతల 'దోపిడీ'
- ఎకరాకు రూ.10లక్షల 'కే' టాక్స్
- వెంచర్లలో హెచ్చరిక బోర్డులు
- వైఎస్సార్ సీపీ సానుభూతిపరులే లక్ష్యం
- లబోదిబోమంటోన్న ప్లాట్ యజమానులు

సాక్షి ప్రతినిధి, కాకినాడ: కూటమి నేతల ధన దాహానికి రియల్ ఎస్టేట్ రంగం కుదేలైపోతోంది. ఎన్నికల్లో పెట్టిన ఖర్చు అంతా రికవరీ చేసుకునేందుకు నేతలు రియల్ ఎస్టేట్ రంగంపై పడ్డారు. వెంచర్‌లు, లే అవుట్‌లు ఎక్కడెక్కడ ఉన్నాయో తెలుగు తమ్ముళ్ల ద్వారా సమాచారాన్ని సేకరించి రూ.లక్షలు గుంజే పనిలో పడ్డారు. ఇందుకు వైఎస్సార్ సీపీ నేతలు, ఆ పార్టీ సానుభూతిపరులు వేసిన రియల్ ఎస్టేట్ వెంచర్‌లనే లక్ష్యంగా చేసుకున్నారు. వెంచర్ వేసిన ప్రాంతంలో ఉన్న డిమాండ్‌ను బట్టి ఎకరాకు ఇంత అని కే (కూటమి)టాక్స్ వేస్తున్నారు. ఈ వ్యవహారంలో కౌడా (కాకినాడ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ) యంత్రాగాన్ని ముందు పెట్టి తెర వెనుక కూటమి నేతలు చక్కబెడుతున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. గత ప్రభుత్వ హయాంలో రియల్ ఎస్టేట్ రంగం భూం దాంగా నడిచింది. అటువంటి రియల్ ఎస్టేట్ రంగాన్ని కూటమి ప్రజా ప్రతినిధులు సొమ్ము కోసం కక్కుర్తిపడి కుదేలయ్యేలా చేస్తున్నారు. ద్వితీయ శ్రేణి నేతల ద్వారా అనధికార లే అవుట్‌లని బెదిరింపులకు దిగుతూ నియోజకవర్గ ప్రజాప్రతినిధులు రూ.కోట్లు కొట్టేసే మాస్టర్ ప్లాన్ వేశారు. చేతికి మట్టి అంటకుండా చక్కబెట్టేసే స్కెచ్ ఇది.



కొవ్వాడ వెంచర్‌లో ఏర్పాటు చేసిన హెచ్చరిక బోర్డు



సామర్లకోటలోని లేఅవుట్

బెదిరింపులు మొదలు

ఇందుకు తొలి విడత కౌడా అధికారులతో అనధికార లే అవుట్‌లంటూ పలు వెంచర్లలో హెచ్చరిక బోర్డులు పెట్టించారు. కొన్ని ప్రాంతాల్లో జెండాలు పాతించారు. ఇదే అదనుగా మండల, గ్రామ స్థాయిలో కూటమి నేతల నుంచి వైఎస్సార్ సీపీ సానుభూతిపరులైన రియల్టర్‌లకు కప్పం కట్టాల్సిందేనంటూ బెదిరింపుల పర్వానికి తెర లేచింది. అధికార యంత్రాంగం కూడా కూటమి నేతలు చెప్పినట్టు నడుచుకుంటోంది. అనధికార లే అవుట్ జాబితాలతో కౌడా పేరుతో పత్రికల్లో ప్రకటనలు విడుదల చేయించారు. అనధికార లే అవుట్‌లలో ఉన్న స్థలాలు కొనుగోలు, అమ్మకాలు జరపవద్దు అంటూ ఉత్తర్వులు కూడా జారీచేశారు. ఇలా కాకినాడ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ అజమాయిషీలోని కాకినాడ రూరల్, పెద్దాపురం, జగ్గంపేట, అనపర్తి నియోజకవర్గాలలోని పెదపూడి, ఉప్పాడ కొత్తపల్లి, పెద్దాపురం, కిర్లంపూడి, శంఖవరం, గొల్లప్రోలు, జగ్గంపేట, గండేపల్లి, సామర్లకోట, కాకినాడ రూరల్ మండలాల్లోని 15 గ్రామాల్లో సుమారు 42 లే అవుట్‌లపై కూటమి నేతలు దృష్టి సారించారు. ఇవి ఒక ఎకరం, మూడు ఎకరాలు, ఆరు, తొమ్మిది, 15 ఎకరాల లోపు వేసిన వెంచర్లే. దాదాపు ఈ వెంచర్‌లు అన్ని కూడా వైఎస్సార్ సీపీ సానుభూతిపరులు వేసినవే. ఎకరాకు రూ.10 లక్షలు తక్కువగాకుండా కే టాక్స్ కట్టాల్సిందేనంటూ కూటమి నేతలు ఒత్తిళ్లు తెస్తున్నారు. వారు అడిగినంతా ఇచ్చుకుంటే సరేసరి లేదంటే ముందుకు సాగనివ్వబోమని అనుచరుల ద్వారా హెచ్చరికలు జారీచేస్తుండటంతో వెంచర్లు వేసిన వారి పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. అప్పులు చేసి రూ.లక్షలు పెట్టుబడి పెట్టి ఇప్పుడు ఎకరాకు రూ.10 లక్షలు అంటే ఎలా ఇచ్చుకుంటామని రియల్టర్‌లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కొనుగోలుదారుల ఆందోళన

రియల్టర్‌ల పరిస్థితి ఇలా ఉంటే వీటిని కొనుగోలుచేసిన వారు అయోమయంలో పడ్డారు. ఆయా వెంచర్లలో రూ.లక్షలు పోసి వందలాది మంది ప్లాట్లు కొనుగోలు చేశారు. చిరుద్యోగులు, మధ్యతరగతి, చిరు వ్యాపారులు భవిష్యత్‌కు భద్రంగా ఉంటుందనే భరోసాతో కొనుగోలు చేశారు. గజం రూ.15వేల నుంచి రూ.20వేల ధరల్లో 150, 200, 250 గజాల వంతున ప్లాట్‌లు కొనుగోలు చేశారు. అలా కొనుగోలు చేసిన యజమానులు కౌడా యంత్రాంగం జారీచేసిన ప్రకటనలతో లబోదిబోమంటున్నారు. రూ.20 లక్షల నుంచి రూ.30 లక్షలు పెట్టి కొనుగోలు చేసిన ప్లాట్‌లు ఏమి చేయాలో తెలియక ఆందోళన చెందుతున్నారు. దాదాపు వీరంతా మధ్య తరగతి వర్గాల వారే కావడం గమనార్హం. గతంలో తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో వేసిన వెంచర్‌లలో కొనుగోలు చేసిన అనధికార లే అవుట్‌ల వైపు కన్నెత్తి చూడటం లేదు. ప్రధానంగా గత ఐదేళ్లలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ఆ పార్టీ సానుభూతిపరులు వేసిన వెంచర్లు, వాటిలో కొనుగోలు చేసిన ప్లాట్‌లే లక్ష్యంగా చేసుకున్నారు. వెంచర్లు ఉన్న ప్రాంతంలో డిమాండ్‌ను బట్టి ఎకరాకు రూ.5 లక్షల నుంచి రూ.10లక్షలు కప్పం కట్టాల్సిందేనని కూటమి నేతలు బెదిరింపులకు దిగుతున్నారు. ఆయా నియోజకవర్గాల ప్రజాప్రతినిధుల ఆదేశాలు లేకుండా ఈ బేరసారాలు తంతు జరగడం లేదనేది బహిరంగ రహస్యం.

నిబంధనల ప్రకారమే చర్యలు



జిల్లాలో అనధికార లేఅవుట్లపై నిబంధనల ప్రకారమే చర్యలు తీసుకుంటున్నాం. ప్రభుత్వాదేశాల మేరకు ఇప్పటికే 50 అనధికార లేఅవుట్లు గుర్తించాం. ఇంకా గుర్తింపు ప్రక్రియ కొనసాగుతోంది. గ్రామాలు, పట్టణ శివారు ప్రాంతాల్లోను అనధికార లేఅవుట్లలో ఇళ్ల స్థలాలు కొని మోసపోవద్దు. ఎవరైనా ఇల్లు కట్టి ఉంటే వారి నుంచి రిజిస్ట్రేషన్ వాల్యూపై 14 శాతం కాంపోనెంట్ ఫీజు వసూలు చేస్తాం. ప్రస్తుతం గుర్తించిన అనధికార లేఅవుట్లకు కౌడా ద్వారా, గ్రామ పంచాయతీ కార్యదర్శుల ద్వారా నోటీసు బోర్డులు ఏర్పాటు చేస్తున్నాం. అనధికార లేఅవుట్ల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి.

– పి.కృష్ణమూర్తి, వీసీ, కాకినాడ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ

రెండు హైస్కూళ్లకు స్పోర్ట్స్ ఆఫ్ ఎక్సలెన్స్ అవార్డు

కరప: మండల పరిధిలోని రెండు జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలకు ''స్కూల్ ఆఫ్ స్పోర్ట్స్ ఎక్సలెన్స్'' అవార్డు లభించింది. జాతీయ క్రీడాదినోత్సవం(ఆగస్టు 29) పురస్కరించుకుని రాష్ట్ర విద్యాశాఖ ఉత్తర్వులు మేరకు జిల్లా విద్యాశాఖ ఈ అవార్డు ప్రకటిస్తుంది. 2023–24 విద్యాసంవత్సరంలో జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిలో వివిధ క్రీడల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన పాఠశాలలను గుర్తించి స్కూల్ ఆఫ్ స్పోర్ట్స్ ఎక్సలెన్స్ అవార్డును జిల్లా విద్యాశాఖ ప్రకటించింది. అందులో భాగంగా గురజనాపల్లి పబ్బినీడి పాపారావు జెడ్పీ ఉన్నత పాఠశాలకు ఈ అవార్డు వచ్చినట్టు హెచ్ఎం ఎ.సాయిమోహన్ బుధవారం తెలిపారు. జాతీయస్థాయిలో రగ్బీ ఆటలోను, జిల్లా, రాష్ట్ర స్థాయిలో ఖోఖో, ఫుట్‌బాల్ ఆటలలో ప్రతిభ కనబరచడంతో తమ పాఠశాలకు ఈ అవార్డు వచ్చిందన్నారు. గురువారం కాకినాడలో డీఈఓ పి.రమేష్ నుంచి అవార్డును పీడీ కె.నాగలింగేశ్వరరావుతో కల్సి తీసుకోనున్నట్టు హెచ్ఎం తెలిపారు. అలాగే కరప నక్కా సూర్యనారాయణమూర్తి జెడ్పీ ఉన్నత పాఠశాలకు కూడా స్కూల్ ఆఫ్ స్పోర్ట్స్ ఎక్సలెన్స్ అవార్డు వచ్చినట్టు హెచ్ఎం ఎం.శ్రీనివాసరావు తెలిపారు.

వైద్యం సరే బాధ్యులపై చర్యలేవి?

- 88 మంది విద్యార్థినులు అస్వస్థతకు గురైతే పట్టించుకోరా?
- నేతలు, అధికారుల వైఖరిని తప్పుపడుతున్న తల్లిదండ్రులు

ఏలేశ్వరం: అభం శుభం తెలియని విద్యార్థినులు తీవ్ర అస్వస్థతకు గురై ఆసుపత్రి పాలైతే వైద్యసేవలు అందించి చేతులు దులుపుకోవడంపై విమర్శలు వస్తున్నాయి. 88 మంది విద్యార్థినులు రెండురోజుల పాటు ప్రాణాలు గుప్పెట్లో పెట్టుకుని కాలం వెళ్లదీస్తే దీనికి కారణాలపై విచారణకు ఆదేశించకుండా కేవలం వైద్యసేవలతో పాటు ఫుడ్ శాంపిల్స్ సేకరించడంతో సరిపెట్టడంపై సర్వత్రా విమర్శలు వస్తున్నాయి. స్థానిక బీఆర్ అంబేడ్కర్ బాలికల గురుకుల పాఠశాల/కళాశాలలో మంగళవారం ఫుడ్ పాయిజన్ కావడంతో 88 మంది విద్యార్థినులు అస్వస్థతకు గురయిన సంగతి తెలిసిందే. వీరిని స్థానిక కమ్యూనిటీ హెల్త్‌సెంటర్‌కు తరలించి చికిత్స అందిస్తున్నారు. వీరిలో 56 మందికి ఆరోగ్యం బాగుపడడంతో బుధవారం డిశ్చార్జ్ చేశారు. పాఠశాలలో 625 మంది విద్యార్థినులకు




ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థినులు

తృటితో ప్రాణాప్రాయం తప్పింది. ఇంతటి సంఘటన జరిగితే ఎంపీ తంగెళ్ల ఉదయ్‌శ్రీనివాస్, ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ, కలెక్టర్ షణ్మోహన్, డీఎంఅండ్‌హెచ్ఓ నరసింహ నాయక్ విద్యార్థినులను పరామర్శించడంతో సరిపెట్టారు. విచారణకు ఆదేశించకుండా వీరంతా పరామర్శలతో సరిపెట్టడంపై తల్లిదండ్రులు, స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కాగా పాఠశాలలో పరిస్థితులు అనుకూలంగా లేకపోవడంతో విద్యార్థినులు ఇంటిముఖం పట్టారు. రెండురోజుల అనంతరం వారు తిరిగి రానున్నట్టు ప్రిన్సిపాల్ చంద్రశారద తెలిపారు.



ఇళ్లకు వెళ్లిపోతున్న విద్యార్థినులు


తల్లిదండ్రుల్లో నమ్మకం కలిగించాలి



ఆసుపత్రిలో విద్యార్థినులను ప్రజాప్రతినిధులు, అధికారులు పరామర్శలకు పరిమితమవ్వడం దారుణం. దీనికి కారణమైన వారిపై విచారణ జరపాలి. తల్లిదండ్రుల్లో నమ్మకం కలిగించాలి.

– ఏగుపాటి అర్జునరావు, ప్రధాన కార్యదర్శి, సీపీఐ(ఎంఎల్)లిబరేషన్‌పార్టీ


విచారణ చేపట్టాలి



గురుకుల పాఠశాలలో జరిగిన ఘటనపై విచారణ చేపట్టాలి. వైద్యసేవలతో సరిపెట్టడం సరికాదు. దీనిపై విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలి.

– సామంతుల సూర్యకుమార్, మాజీ మున్సిపల్ కౌన్సిలర్, ఏలేశ్వరం

వైద్యంతో సరిపెడుతున్నారు



గురుకుల పాఠశాలలో 88 విద్యార్థినులు ప్రాణాపాయం నుంచి బయటపడితే వైద్యంతో సరిపెడుతున్నారు. దీనిపై విచారణ జరిపి తల్లిదండ్రుల్లో ఉన్న అనుమానాలు తొలగించాలి.

– సుంకర రాంబాబు, మాజీ మున్సిపల్ కౌన్సిలర్, ఏలేశ్వరం

తెలుగు పలుకే వెలుగు రేఖ

- భావితరాలకు అందిద్దాం
- భాషను పరిరక్షిద్దాం
- నేడు తెలుగుభాషా దినోత్సవం


సీటీఆర్ఐ (రాజమహేంద్రవరం)/కాకినాడ సిటీ/పిఠాపురం: దేశభాషలందు తెలుగులెస్స అని శ్రీకృష్ణదేవరాయలు మన మాతృభాషను కీర్తించారు. ఎంతో తపస్సు చేస్తే గానీ ఆంధ్ర దేశంలో పుట్టడం, ఆంధ్రభాషను నేర్చుకునే అదృష్టం రాదని అప్పయ్య దీక్షితులు కొనియాడారు. సుందరమైన తెలుగు పాట పాడుతూ, సింధూ నదిలో పడవ నడుపు అంటూ తమిళ కవి సుబ్రహ్మణ్య భారతి వ్యాఖ్యానించారు. ఇంత గొప్పదైన తెలుగుభాష నేడు ఆంగ్లం ప్రభావానికి లోనై వెనుకబడుతోంది. వ్యక్తి పరిపూర్ణ వ్యక్తిత్వం సాధించాలంటే అమ్మభాషపై పట్టు ఉండాలి. నేడు తెలుగుభాషా దినోత్సవం. ఈ సందర్భంగా తెలుగు భాష గొప్పదనాన్ని గుర్తు చేసుకుందాం.



గిడుగు రామమూర్తి

కమ్మనైన తెలుగు

తెలుగుభాష కమ్మదనాన్ని ప్రతి ఒక్కరూ గుర్తించాలి. తెలుగును ప్రేమిస్తే మన అమ్మను గౌరవించినట్టే. అప్పట్లో గ్రాంధిక భాషకు పట్టం కడుతున్న రోజుల్లో వ్యవహారిక భాషను కాపాడటానికి గిడుగు వెంకట రామమూర్తి పోరాటం చేశారు. ఆయన శ్రీకాకుళం జిల్లాలోని పర్వతాల పేటలో 1863 ఆగస్టు 29న వీర్రాజు, వెంకమ్మ దంపతులకు జన్మించారు. ఏవీఎన్ కాలేజీ ప్రధానాధ్యాపకుడు శ్రీనివాస అయ్యంగార్, గురజాడ అప్పారావు, గిడుగు రామమూర్తి పంతులు కలిసి వ్యవహారిక భాషలో బోధనోద్యమానికి శ్రీకారం చుట్టారు. అప్పటికే రామమూర్తి వ్యావహారిక భాషలో బోధన కోసం ప్రచారం చేయడం ఆరంభించారు. ఇందుకోసం ఆయన తెలుగు అనే పత్రికను ప్రారంభించారు. పర్లాకిమిడిని నాటి ఒడిశా రాష్ట్రంలో విలీనం చేసినందుకు నిరసనగా రామమూర్తి తన నివాసాన్ని రాజమహేంద్రవరానికి మార్చారు. ఇక్కడ కవి పండితులు ఎక్కువ మంది ఉండటంతో ఇదే తన వ్యవహారిక భాషోద్యమానికి సరైన వేదిక అవుతుందన్నారు. అలాగే చివరి వరకూ రాజమహేంద్రవరంలోనే నివసించారు. తెలుగు భాషకు ఆయన చేసిన సేవలకు గుర్తుగా ఆయన జయంతిని తెలుగు భాషా దినోత్సవంగా జరుపుకొంటున్నారు.



పిఠాపురం సూర్యరాయ విద్యానంద గ్రంథాలయంలో సూర్యరాయాంధ్ర నిఘంటువులు

పరిరక్షణకు కృషి

తెలుగును రక్షించుకోవాల్సిన అవసరం నేటి సమాజంపై ఉందని భాషాభిమానులు అభిప్రాయపడుతున్నారు. ప్రస్తుతం భావజాలపరంగా, భాషాపరంగా పరాయీకరణ ఎక్కువవుతోందన్నారు. ఉద్యోగం, ఉపాధి కోసం పరాయి భాషలను నేర్చుకోవడం తప్పులేదు, అదే సమయంలో మాతృభాషను కాపాడుకోవడం చాలా అవసరమని చెబుతున్నారు. అందుకే తెలుగు పరిరక్షణకు ప్రతి ఒక్కరూ నడుం బిగించాలని పిలుపునిస్తున్నారు. ప్రాథమిక పాఠశాలల స్థాయి నుంచి విశ్వవిద్యాలయాల వరకూ తెలుగుభాషను పటిష్టం చేయాలని కోరుతున్నారు. అప్పుడే గిడుగు రామమూర్తికి అసలైన నివాళి అర్పించినట్టు అవుతుందన్నారు. ఉమ్మడి జిల్లాలో కొందరు భాషాభిమానులు తెలుగును కాపాడటానికి అనేక చర్యలు తీసుకుంటున్నారు. అలాగే పలు సంస్థలు కూడా ఈ విధంగానే ముందుకు వెళుతున్నాయి. తెలుగుభాష కోసం కృషి చేస్తున్న కవులు, రచయితలను సన్మానిస్తూ ప్రోత్సహిస్తున్నాయి. పిల్లలకు సైతం తెలుగు భాషపై మక్కువ పెంచే కార్యక్రమాలను నిర్వహిస్తున్నాయి.

తెలుగు భాషను కాపాడుకుందాం



తెలుగుభాషను కాపాడుకునేందుకు తెలుగువాళ్లందరూ ప్రయత్నించాలి. తెలుగులో చదువుకున్న వారికి ప్రభుత్వ ఉద్యోగాల్లో ప్రాధాన్యతనివ్వాలి. తల్లి భాషను కాపాడుకుంటూ ఇతర భాషలపై పట్టు సాధించడం మంచిది. ముఖ్యంగా నామ ఫలకాలను సైతం తెలుగులో ఉండేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి. దీనిపై మేము ఎన్నో ప్రయత్నాలు చేస్తున్నాం.

– ర్యాలి ప్రసాద్, చరిత్ర పరిశోధకులు, వచన కవితా సహస్రావధాని, కాకినాడ


సమాజంలో మార్పు రావాలి



తల్లిదండ్రులు పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పకుండా చిన్నప్పుడే ఆంగ్ల మాధ్యమ పాఠశాలల్లో చేర్పుతున్నారు. పిల్లలచే అమ్మా, నాన్న అని పిలిపించుకోవడాన్ని కొందరు చిన్నతనంగా భావిస్తున్నారు. ఇప్పుడు మమ్మీ, డాడీ సంస్కృతి బాగా పెరిగిపోయింది. ఉన్నత పదవులు చదివిన వారికి కూడా తెలుగును స్పష్టంగా చదవడం, రాయడం రావడం లేదు.

– అనుసూరి సునీత, తెలుగు ఉపాధ్యాయురాలు, పీఆర్ ప్రభుత్వ బాలికల పాఠశాల, కాకినాడ.

పుస్తక పఠనంపై ఆసక్తి



విద్యార్థులలో తెలుగు సాహిత్యం, భాషపై అభిమానాన్ని పెంపొందించడానికి పాఠశాలలు, కళాశాలల్లో తెలుగు పద్యాలు, వక్తృత్వ పోటీలను నిర్వహించాలి. సాంకేతిక విజ్ఞానం వినూత్న రూపాలలో వ్యాప్తి చెందిన నేపథ్యంలో సెల్‌ఫోన్, టీవీ, కంప్యూటర్ వంటి వాటిని అవసరానికి మించి వాడకూడదు. సాహిత్య సంస్థలు నిర్వహించే కార్యక్రమాలకు వెళ్లడం వల్ల పుస్తక పఠనంపై ఆసక్తి పెంపొందుతుంది.

– డాక్టర్ కిలారి గౌరీ నాయుడు, రాచకొండ నరసింహశర్మ సాహితీ సంస్థ ఉపాధ్యక్షుడు

క్లుప్తంగా

ఆహార నాణ్యతకు వేదికగా జేఎన్‌టీయూకే



ఒప్పంద పత్రాలు మార్చుకుంటున్న వీసీ మురళీకృష్ణ, ఏపీ పాత్ ఫౌండేషన్ హెడ్ సమీరా

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): ఆహార నాణ్యత ప్రమాణాలకు వేదికగా జేఎన్‌టీయూకే నిలుస్తుందని ఇన్‌చార్జ్ వీసీ డాక్టర్ మురళీకృష్ణ అన్నారు. జేఎన్‌టీయూకే ఫుడ్ టెస్టింగ్ ల్యాబ్, అమెరికా పాత్ ఫౌండేషన్ మధ్య బుధవారం వీసీ చాంబర్‌లో ఎంఓయూ జరిగింది. ఈ సందర్భంగా వీసీ మురళీకృష్ణ మాట్లాడుతూ ఈ ఒప్పందం ద్వారా పౌరసరఫరాల శాఖ ద్వారా రాష్ట్రంలో బియ్యం, నిత్యావసరాలు సరఫరా కాకముందే పాత్ ఫౌండేషన్ ద్వారా నాణ్యత పరీక్షలు చేపట్టి ప్రభుత్వానికి అందజేస్తారన్నారు. తద్వారా వర్సిటీలో ల్యాబ్‌కు ఆదాయం చేకూరుతుందన్నారు. అనంతరం ఫుడ్ టెక్నాలజీ విభాగాధిపతి డాక్టర్ మాలోతు రమేష్, ఫౌండేషన్ సౌత్ ఏషియా డైరక్టర్ నీరజ్ జైన్ ఏపీ పాత్ ఫౌండేషన్ హెడ్ సమీరా సంతకాలు చేసి ఎంఓయూలు మార్చుకున్నారు. కార్యక్రమంలో రెక్టార్ కేవీ రమణ, రిజిస్ట్రార్ రవీంద్ర పాల్గొన్నారు.

కట్నం వేధింపులు

అంబాజీపేట: కట్నం వేధింపులపై మహిళ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు ఎస్సై కె.చిరంజీవి తెలిపారు. మాచవరానికి చెందిన కృష్ణసాయి స్వప్న దీపికకు గాడేపల్లి వెంకట విక్రమ్‌తో గతేడాది అక్టోబర్ 21న వివాహం జరిగింది. విక్రమ్ వృత్తిరీత్యా కెన్యాలో ఉంటున్నాడు. భర్తతో ఉంటున్న దీపికను అత్త, మామ, భర్తతో పాటు మరో 9 మంది అదనపు కట్నం కోసం మానసికంగా వేధిస్తున్నారన్నారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కాలువలో పడి మహిళ మృతి

అయినవిల్లి: కాలువలో పడి ఓ మహిళ మృతి చెందిన ఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. ఎస్సై కె.మనోహరజోషి తెలిపిన వివరాల ప్రకారం..ఉప్పలగుప్తం మండల భీమనపల్లి గ్రామానికి చెందిన కడలి మంగాయమ్మ (70) అయినవిల్లిలోని పూలతోటలోని ఉంటున్న బంధువుల ఇంటికి మూడ్రోజుల క్రితం వచ్చింది. సోమవారం రాత్రి సమీపంలోని పంటకాలువకు వెళ్లిన ఆమె అదృశ్యమైంది కాగా.. శానపల్లిలంక పంట కాలువలో బుధవారం ఆమె మృతదేహం లభ్యమైంది. పోలీసులు ఆమె మృతదేహానికి పంచనామా నిర్వహించి అమలాపురం ఏరియా ఆస్పత్రికి తరలించారు. మృతురాలి కుమారుడు శ్రీనివాసరావు ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



కఠిన శిక్షలు విధించాలి

మహిళా డాక్టర్లు, సిబ్బందిపై దాడులకు పాల్పడుతున్న వారిని కఠినంగా శిక్షించాలి. కోల్‌కతా తరహా సంఘటనలు పునరావృతం కాకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలి. ఆరోగ్యకర సమాజం కోసం కృషి చేస్తున్న వైద్యులకు రక్షణ కరువైంది. ప్రభుత్వ వైద్యశాలలలో ప్రత్యేక భద్రతను ఏర్పాటు చేయాలి. మత్తుపదార్థాల రవాణా, వినియోగాన్ని అరికట్టబడితే ఈ తరహా ఘటనలను నివారించవచ్చు.

– డాక్టర్ శ్రీవల్లి, కోటికేశవరం పీహెచ్‌సీ వైద్యురాలు





దేశమంతటా ఒకే నంబర్ ఉండాలి

మహిళా వైద్యులు పనిచేసే ప్రాంతాల్లో ప్రభుత్వాలు కట్టుదిట్టమైన భద్రత కల్పించాలి. కోల్‌కతాలోని ఆర్‌జీ కార్ ఆస్పత్రి సంఘటనలు ఎదురయ్యే సందర్భాల్లో దేశమంతా హెచ్చరికలు జారీ చేసేలా మహిళా వైద్యులకు ఒక యూనివర్సియల్ నంబర్ ఏర్పాటు చేయాలి. రాత్రి షిఫ్ట్‌లలో పనిచేసే మహిళ వైద్యులు విశ్రాంతి తీసుకునే సమయంలో రక్షణ కల్పించాలి. మహిళా వైద్యుల భద్రతను పెంపొందించడానికి సమష్టిగా కృషి జరగాలి.

– వాసిరెడ్డి వినీల, అసిస్టెంట్ ప్రొఫెసర్, కిమ్స్, అమలాపురం.

ఆటంకాలెన్నో..

- క్రీడలలో యువత వెనుకబాటు
- వేధిస్తున్న వసతుల కొరత
- నేడు జాతీయ క్రీడా దినోత్సవం

సాక్షి, అమలాపురం: ఫ్రాన్స్‌లో ఇటీవల జరిగిన ఒలింపిక్స్‌లో మన దేశానికి కేవలం ఆరు పతకాలు మాత్రమే వచ్చాయి. వీటిలో ఒక్క బంగారు పతకం కూడా రాలేదు. కేవలం ఒక్క రజితం, మిగిలిన ఐదు కాంస్య పతకాలే. ప్రతిభావంతులైన క్రీడాకారులు ఉన్నా పేలవమైన ప్రదర్శనతో పతకాలు సాధించలేకపోయారు. కనీసం ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా అంత విస్తీర్ణం కూడా లేని దేశాలు పలు పతకాలు సాధించాయి.

ఇవన్నీ ఉమ్మడి జిల్లాలోని నగటు క్రీడాభిమానికి నిరుత్సాహం కలిగించేవే. క్రీడల్లో రాజకీయాలు, ఎంపికలో పక్షపాతం, అసోసియేషన్ సిఫారసులు, అధ్వాన మైదానాలు, క్రీడలలో తర్ఫీదు ఇవ్వని వ్యాయామ ఉపాధ్యాయులు.. ఇలా చెప్పుకుంటూ పోతే మన దేశం ఒలింపిక్స్‌లోనే కాదు కామన్ వెల్త్, ఆసియా వంటి క్రీడల్లో సైతం పెద్దగా పతకాలు సాధించలేకపోతోంది. నేడు హాకీ మాంత్రికుడు మేజర్ ధ్యాన్‌చంద్ జయంతి, అలాగే జాతీయ క్రీడా దినోత్సవం కూడా. ఈ నేపథ్యంలో ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో క్రీడల వెనుకబాటు, ప్రోత్సాహంపై కథనం.



కోచ్‌ల కొరతతో ఇబ్బందులు ఎదుర్కొంటున్న బాలయోగి స్టేడియం

ఉమ్మడి జిల్లాలో..

ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో కాకినాడ, రాజమహేంద్రవరం నగరాలు, అమలాపురం, రామచంద్రపురం, పిఠాపురం వంటి మున్సిపాలిటీల్లో ఎంతో కొంత క్రీడల సాధనకు అవకాశాలున్నాయి. మిగిలిన మున్సిపాలిటీలు, మేజర్ పంచాయతీల్లో క్రీడల ప్రోత్సాహం, సాధన చేసేందుకు మైదానల కొరత పట్టి పీడిస్తోంది. రాజమహేంద్రవరంలో మున్సిపల్ స్టేడియం అభివృద్ధి దశాబ్దాలుగా ఆధునీకరణ జరగడం లేదు. ఉమ్మడి జిల్లా కేంద్రంగా ఉన్న కాకినాడలో అప్పట్లో జిల్లా క్రీడాప్రాధికార సంస్థ (డీఎస్‌ఏ) మైదానం ఉండేది. దీని వల్ల ఇక్కడ కొంత వరకు అభివృద్ధి జరిగింది. ఇక కొత్తగా ఏర్పడిన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కేంద్రం అమలాపురంలో 2004లో నిర్మించిన బాలయోగి స్టేడియం గడిచిన రెండు దశాబ్దాలుగా అభివృద్ధి చెందిన దాఖలాలు లేవు. ఇక జెడ్పీ ఉన్నత పాఠశాలల్లో ఉన్న మైదానాల అభివృద్ధి గురించి ఎంత తక్కువగా చెప్పుకుంటే అంత మంచిది. మైదానాలలో కనీస మరమ్మతులు, క్రీడా మైదానాల ఆధునీకరణ, క్రీడా సామగ్రి అందించడం, విద్యార్థులకు తర్ఫీదు అంతంత మాత్రమే. ఈ కారణంగానే ప్రతిభావంతులున్నా ఒలింపిక్స్‌లో రాణించలేకపోతున్నారు..

బడ్జెట్‌లో నిధులు పెంచాలి



మూడేళ్లు ఆంధ్రా యూనివర్సిటీ అథ్లెటిక్ చాంపియన్‌గా నిలిచాను. జూనియర్ నేషనల్స్‌లో పరుగు పెట్టాను, రైల్వేలో పనిచేశారు. సుమారు 100 మంది క్రీడాకారులను తీర్చిదిద్దాను. కేంద్రం, రాష్ట్ర ప్రభుత్వాలు బడ్జెట్‌లో క్రీడలకు నిధులు కేటాయించాలి. లేకుంటే అంబానీ, అదానీ, టాటా వంటి కంపెనీల నుంచి నిధులు మంజూరు చేయించాలి. మన దేశంలో ఒలింపిక్స్ గెలిచే స్థాయిలో మౌలిక సదుపాయాలు, మైదానాలు లేవు. ఇతర దేశాలకు వెళ్లి మనవాళ్లు శిక్షణ పొందుతున్నారంటే కారణం మన అర్థం చేసుకోవాలి. నాణ్యమైన డైట్ కూడా అందడం లేదు.

– పెనుమాళ్ల రాజ్‌కుమార్ బాబు, రాజమహేంద్రవరం.

దక్షిణాదిలో ప్రోత్సాహం తక్కువ



ఒలింపిక్స్ పతకాలన్నీ ఉత్తర భారత దేశంలోని క్రీడాకారులకు మాత్రమే వచ్చాయి. అక్కడితో పోల్చుకుంటే దక్షిణాదిలో క్రీడలకు ప్రోత్సాహం చాలా తక్కువ. ఇక్కడ కనీస మౌలిక సదుపాయాలు లేవు. ఇవ్వాల్సిన నిధులు ఇవ్వడం లేదు. ప్రత్యేక డైట్ కూడా వారికి లేకుండా పోయింది. విద్యాహక్కు చట్టంతో ఉచిత విద్య అంటున్న ప్రభుత్వాలు క్రీడలను మాత్రం ప్లే అండ్ పే విధానం అమలు చేయడం సమంజసం కాదు. పేద, మధ్య తరగతి వాళ్లు చాలా క్రీడలకు దూరమవుతున్నారు. రాష్ట్ర క్రీడాప్రాధికార సమితి (సాఫ్)కు వచ్చే అధికారులు పనిష్మెంట్ మీద వస్తున్నారు. వారు బాధ్యతగా పనిచేయడం లేదు.

– జి.ఎలీషా బాబు, జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ కార్యదర్శి, కాకినాడ

క్రీడలకు ప్రోత్సాహం లేదు



రంకిరెడ్డి సాయిరాజ్ సాత్విక్ మాత్రమే రాణించడానికి కారణం తల్లిదండ్రుల ప్రోత్సాహం తప్ప రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాల నుంచి ప్రోత్సాహం లేదు. గెలిస్తే మాత్రం తమ ఘనతగా చెప్పుకుంటారు. వ్యాయామ విద్యలో కనీసం జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొనని వారికి బీపీఈడీ, యూజీడీ చేసే అవకాశం ఇవ్వకూడదు. స్పోర్ట్ ఆడేవారికి పెద్దగా చదువు ఉండదు. చదువుకున్నవారికి ఆటలు రావు. కాని వ్యాయామ ఉపాధ్యాయునిగా అవకాశమొస్తోంది. వీరు ఎటువంటి శిక్షణ ఇవ్వగలరు.

– నల్లమిల్లి అప్పారెడ్డి, వ్యాయామోపాధ్యాయ సంఘం జిల్లా మాజీ అధ్యక్షుడు, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా

బాలయోగి క్రీడామైదానం

కోనసీమ జిల్లా కేంద్రం అమలాపురంలోని బాలయోగి క్రీడా మైదానంలో పరిస్థితి దారుణంగా ఉంది. సుమారు 20 ఏళ్ల క్రితం నిర్మించిన ఈ స్టేడియంలో మరమ్మతులు తప్ప కొత్త నిర్మాణాలు లేవు. ఆధునీకరణకు కేటాయించిన నిధులు అంతంత మాత్రమే. ఆగస్టు 15 వేడుకలతో పాటు అప్పుడప్పుడూ ప్రైవేట్ కార్యక్రమాలు నిర్వహించడం వల్ల మైదానం దెబ్బతింటోంది. ఇక్కడ మొత్తం 16 రకాల క్రీడలకు శిక్షణ ఇవ్వాలని లక్ష్యంగా పెట్టుకోగా, ఒక చీఫ్ కోచ్‌తో పాటు మరో నలుగురు కోచ్‌లు ఉన్నారు. కానీ ఇక్కడ కనీసం 15 మంది వరకు కోచ్‌లు అవసరం. కీలకమైన అథ్లెటిక్స్, క్రికెట్, బ్యాడ్మింటన్, ఫుట్‌బాల్, కోకో, కబడ్డీ వంటి కీలకమైన ఆటలకు సైతం కోచ్‌లు లేరు.

పవర్ లిఫ్టింగ్ జిల్లా జట్టు ఎంపిక

అమలాపురం టౌన్: అమలాపురంలో సెప్టెంబర్ 14, 15 తేదీల్లో ఆంధ్ర ప్రదేశ్ పవర్ లిఫ్టింగ్ రాష్ట్ర స్థాయి పోటీలు జరగనున్నాయి. వీటిలో తలపడే జిల్లా జట్టును బుధవారం స్థానిక హెల్త్ ఫిట్‌నెస్ జిమ్‌లో ఎంపిక చేశారు. జిల్లా సెలెక్షన్ కమిటీ చైర్మన్, సభ్యులు మట్టపర్తి సముద్రం, డీఆర్‌కే నాగేశ్వరరావు, జి.గణేష్‌బాబు, కత్తుల శ్రీనివాసరావు, పి.రత్నకుమారి, సీహెచ్.రాజబాబు సమక్షంలో ఈ ప్రక్రియ జరిగింది. సబ్ జూనియర్, జూనియర్, సీనియర్, మాస్టర్స్ (మెన్ అండ్ వుమెన్) విభాగాలకు సంబంధించి జిల్లా వ్యాప్తంగా 70 మంది క్రీడాకారులు తరలి వచ్చారు. వారిలో అత్యుత్తమ ప్రతిభ చూపిన 30 మందిని ఎంపిక చేసినట్లు జిమ్ కోచ్ డాక్టర్ కంకపాటి వెంకటేశ్వరరావు తెలిపారు. అనంతరం జిమ్‌లో జరిగిన కార్యక్రమంలో ఆ క్రీడాకారులను జిల్లా పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు యెనుముల కృష్ణ పద్మరాజు, కార్యదర్శి వంటిద్దు వెంకన్నాయుడు తదితరులు అభినందించారు.



పవర్ లిఫ్టింగ్ జిల్లా జట్టుకు ఎంపికైన క్రీడాకారులతో అసోసియేషన్ ప్రతినిధులు

జీజీయూలో వాణి పథకంపై వర్క్‌షాప్

రాజానగరం: అఖిల భారత సాంకేతిక విద్యా మండలి (ఏఐసీటీఈ) చేపట్టిన వాణి పథకంపై గోదావరి గ్లోబల్ యూనివర్సిటీ (జీజీయూ)లో రెండు రోజుల పాటు నిర్వహించే వర్క్‌షాప్ బుధవారం ప్రారంభమైంది. ఈ కార్యక్రమానికి సంబంధించిన బ్రోచర్‌ని వీసీ డాక్టర్ యు.చంద్రశేఖర్ విడుదల చేశారు. ఆయన మాట్లాడుతూ విద్యుత్ వాహనాలలో ఉపయోగించి వదిలేసిన బ్యాటరీల వల్ల పర్యావరణంలో వస్తున్న వివిధ పరిణామాలు అనే అంశంపై పెట్రోలియం విభాగం ఆధ్వర్యంలో ఈ వర్క్‌షాప్ జరుగుతుందన్నారు. ధన్‌బాద్‌లోని ఐఐటీ, ఐఎస్‌ఎం, నెల్లూరులోని వీఐటీ, విజయవాడలోని ఎస్‌ఆర్‌ఎం, ఫిక్కీ, హైదరాబాద్‌లోని ఎస్‌ఐఆర్‌డీపీఎంల నుంచి పలువురు ప్రముఖులు ఈ వర్క్‌షాప్‌లో పాల్గొంటారన్నారు. అలాగే తూర్పు గోదావరి, విశాఖపట్నం, విజయనగరం జిల్లాల నుంచి అధ్యాపకులు, విద్యార్థులు, పారిశ్రామిక వేత్తలు హాజరవుతారన్నారు. కార్యక్రమంలో డైరెక్టర్ డాక్టర్ ఎం.శ్రీనివాసరావు, రిజిస్ట్రార్ డాక్టర్ పీఎంఎంఎస్ శర్మ, ప్రిన్సిపాల్ డాక్టర్ టి.జయానందకుమార్, డీన్ డాక్టర్ ఎస్.లీలావతి, హెచ్‌ఓడీ ఎండీ అహ్మద్ షరీఫ్ పాల్గొన్నారు.



బ్రోచర్ విడుదల చేస్తున్న వీసీ చంద్రశేఖర్ తదితరులు

12 నుంచి అంతర్వేదిలో పవిత్రోత్సవాలు

సఖినేటిపల్లి: అంతర్వేదిలోని లక్ష్మీనరసింహ స్వామి దేవస్థానంలో సెప్టెంబర్ 12 నుంచి 15వ తేదీ వరకూ నాలుగు రోజుల పాటు పవిత్రోత్సవాలు నిర్వహించనున్నారు. దేవస్థానం అసిస్టెంట్ కమిషనర్ వి.సత్యనారాయణ బుధవారం ఈ విషయం తెలిపారు. దేశ, రాష్ట్ర ప్రజలకు ఆయురారోగ్య ఐశ్వర్యాలు కలగాలని పవిత్రోత్సవాలు నిర్వహిస్తున్నామన్నారు.

30న శాంతి కల్యాణం

అంతర్వేది ఆలయంలో ఈ నెల 30వ తేదీ శ్రావణ శుక్రవారం బహుళ ద్వాదశి తిథి రోజున ఆర్జిత సేవగా స్వామివారి శాంతి కల్యాణం నిర్వహిస్తున్నట్టు దేవస్థానం అసిస్టెంట్ కమిషనర్ వి.సత్యనారాయణ తెలిపారు. ఆలయ ప్రధాన అర్చకుడు పాణింగిపల్లి శ్రీనివాస కిరణ్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరుగుతుందన్నారు. కల్యాణం టికెట్ల కోసం దేవస్థానం వెబ్‌సైట్‌లో లేదా ఆలయంలోని కౌంటర్‌లో లభిస్తాయన్నారు.

అనుమానాస్పద స్థితిలో బాలుడి మృతి



మహమ్మద్ రిహాన్ మృతదేహం

సఖినేటిపల్లి: అంతర్వేదిపాలెంలోని ముస్లిం విద్యాసంస్థ (మదర్సా)లో విద్యార్థి అనుమానాస్పద స్థితిలో మృతిపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్సై కె.దుర్గా శ్రీనివాసరావు తెలిపిన వివరాల ప్రకారం.. జార్ఖండ్‌కు చెందిన మహమ్మద్ రిహాన్ (14) సదరు విద్యాసంస్థలో నాలుగో తరగతి చదువుతున్నాడు. ఈ క్రమంలో మంగళవారం మంచినీరు తాగుతూ కుప్పకూలిపోయి మృతి చెందాడని సిబ్బంది గుర్తించారు. ఈ విషయాన్ని హైదరాబాద్‌లో నివాసం ఉంటున్న బాలుడి బావ మహమ్మద్ మెర్సన్‌కు తెలిపారు. దీంతో మెర్సన్ హైదరాబాద్ నుంచి అంతర్వేదిపాలెం వచ్చి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదు ఆధారంగా పోలీసుల కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు. సంఘటనా స్థలాన్ని పరిశీలించి ఎస్సై దుర్గా శ్రీనివాసరావు పరిశీలించారు.

సినీఫక్కీలో చేపల వ్యాపారి కిడ్నాప్

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): రాజమహేంద్రవరం సెంట్రల్ జైలు నుంచి బెయిల్‌పై విడుదలైవస్తున్న వ్యక్తిని సినీఫక్కీలో కొందరు కోనసీమ రైతులు కిడ్నాప్ చేసి కారులో ఎత్తుకెళ్లారు. బుధవారం జరిగిన ఈ ఘటనపై కిడ్నాప్‌నకు గురైన వ్యక్తి కుటుంబ సభ్యుడు ఒకటో పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. వివరాల్లోకి వెళితే.. ఒడిశాకు చెందిన సంజయ్ కలాసీ చేపల వ్యాపారం చేస్తుంటాడు. అతడు చాలాకాలంగా తుని, అన్నవరం, కోనసీమ, ఉప్పలగుప్తం, అల్లవరం ప్రాంతాల్లో చెరువుల రైతుల వద్ద చేపలు కొనుగోలు చేసి ఒడిశాకు తీసుకెళ్లేవాడు. ఇలా దాదాపు రూ.7 కోట్ల వరకూ ఆయా రైతులకు బకాయి పడ్డాడు. డబ్బుల విషయంపై సంజయ్ కలాసీ ఎటువంటి సమాధానం చెప్పకపోవడంతో రైతులందరూ ఒడిశా వెళ్లి అడిగారు. అయినా ఫలితం దక్కలేదు. ఈ విధంగా రైతుల వద్ద బకాయిలు పడడం, వారు కేసులు పెట్టడం, బెయిల్‌పై బయటకు రావడం జరుగుతున్నాయి. అయితే ఈ విధంగా ఒక కేసులో బెయిల్‌పై విడుదలై వస్తున్న సంజయ్ కలాసీని కోనసీమకు చెందిన పినిశెట్టి స్వామి, అబ్బు, బాబీ, జానీ ఎత్తుకెళ్లినట్టు అతడి బంధువు మదన్ సింగ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు దర్యాప్తులో ఉంది.

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి

కాకినాడ క్రైం: ప్రమాదవశాత్తూ ఆర్టీసీ బస్సు చక్రం కింద పడి ఓ మహిళ ప్రాణాలు కోల్పోయింది. ప్రత్తిపాడు మండలం ధర్మవరం అంబేడ్కర్ కాలనీకి చెందిన గుమ్మళ్ల నాగరత్నం(35) బుధవారం రాత్రి కాకినాడ జగన్నాథపురం శివాలయం రోడ్డులో తన ద్విచక్ర వాహనంపై యానాం రోడ్డు వైపు వెళుతోంది. అదే సమయంలో కాకినాడ డిపో నుంచి అమలాపురం వెళుతున్న పల్లె వెలుగు ఆర్టీసీ బస్సు అదే దిశలో వెళుతోంది. బస్సు పక్కగా వాహనం నడుపుతున్న నాగరత్నం అదుపు తప్పి పడిపోయింది. ఈ ఘటనలో ఆమె తల మీదకు బస్సు వెనుక చక్రం ఎక్కడంతో అక్కడికక్కడే మృతి చెందింది. ఈ ఘటనపై కాకినాడ వన్ టౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని జీజీహెచ్‌కు తరలించారు.

262 కేజీల గంజాయి స్వాధీనం



నిందితులు, గంజాయిని చూపిస్తున్న సీఐ శ్రీనివాస్ తదితరులు



రావులపాలెం పోలీసులు స్వాధీనం చేసుకున్న గంజాయి బస్తాలు

నల్లజర్ల: జగ్గంపేట నుంచి చెన్నైకు రవాణా చేస్తున్న 262 కేజీల గంజాయిని నల్లజర్ల పోలీసులు మంగళవారం స్వాధీనం చేసుకున్నారు. ఈ సంఘటనకు సంబంధించి నల్లజర్ల సీఐ ఎస్.శ్రీనివాస్ బుధవారం విలేకర్లకు వివరాలు వెల్లడించారు. పోలీసు సిబ్బందితో కలిసి సీఐ శ్రీనివాస్ మంగళవారం సాయంత్రం అనంతపల్లి శివారు వీరవల్లి టోల్‌ప్లాజా వద్ద వాహనాలను తనిఖీ చేస్తున్నారు. ఆ సమయలో ఒక కారు, దాన్ని అనుసరిస్తూ వ్యాన్ వచ్చాయి. పోలీసులు తనిఖీలు చేస్తుండడం చూసి వ్యాన్ డ్రైవర్ పారిపోబోయాడు. వెంటనే పోలీసులు అప్రమత్తమై కారు, వ్యాన్‌ను తనిఖీ చేశారు. వ్యాన్ కింది భాగంలోని ప్రత్యేక అరలో పది బస్తాలలో ఉన్న 262 కిలోల గంజాయిని గుర్తించారు. దీంతో ఆ గంజాయితో పాటు రెండు వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. దీన్ని తరలిస్తున్న తమిళనాడుకు చెందిన నలుగురిని అరెస్ట్ చేశారు. ఈ గంజాయి విలువ రూ.5 లక్షలకు పైగా ఉంటుందని అంచనా. కాగా.. గంజాయిని చాకచక్యంగా పట్టుకున్న సీఐ ఎస్.శ్రీనివాస్, ఎస్సై జి.హరిబాబు, ఏఎస్సైలు మోహనరావు, శ్రీనివాస్, హెచ్‌సీలు, కానిస్టేబుళ్లకు ఎస్పీ పి నరసింహ కిశోర్, డీఎస్పీ దేవకుమార్ రివార్డులు ప్రకటించారు.

మరో 180 కేజీలు

రావులపాలెం: లారీలో తరలిస్తున్న 180 కేజీల గంజాయిని రావులపాలెం పోలీసులు బుధవారం రాత్రి పట్టుకున్నారు. టౌన్ సీఐ జేమ్స్ రత్నరాజు తెలిపిన వివరాల ప్రకారం.. పోలీసులకు అందిన సమాచారం మేరకు రావులపాడు జాతీయ రహదారిపై మల్లాయి దొడ్డి సెంటర్ వద్ద వాహన తనిఖీలు చేపట్టారు. ఆ సమయంలో రాజమహేంద్రవరం వైపు నుంచి తణుకు వైపు వెళ్తున్న లారీలో పది బస్తాలలో నింపిన 180 కేజీల గంజాయిని గుర్తించారు. దాన్ని తరలిస్తున్న ఉత్తరప్రదేశ్‌కు చెందిన శివేష్ సింగ్, పంకజ్ సురేష్ కాకాలను అరెస్టు చేశారు. ఉత్తర ప్రదేశ్ నుంచి ఐరన్ లోడుతో లారీలో బయలుదేరగా రాజమహేంద్రవరం – విశాఖపట్నం మధ్యలో ఏజెన్సీ ఏరియాలో గంజాయి బస్తాలను వేసినట్టు వారు తెలిపారు. గంజాయి విలువ రూ.9 లక్షలు ఉంటుందని అంచనా.

వనరులు, ఆర్థిక రాబడిపై సమీక్ష

కాకినాడ సిటీ: జిల్లా పరిషత్ కార్యాలయంలోని జీఎంసీ బాలయోగి సమావేశ మందిరంలో జెడ్పీ చైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావు పర్యవేక్షణలో రాష్ట్ర ఐదో ఆర్థిక కమిషన్ (ఫిఫ్త్ స్టేట్ ఫైనాన్స్) సభ్యులు బుధవారం సమావేశమయ్యారు. కమిషన్ రాష్ట్ర చైర్మన్ ఎస్.రత్నకుమారి, సభ్యులు కేవీ రమణారెడ్డి, ఎం.ప్రసాదరావు, ఎంపీఎస్ పద్మారావు, కె.కృష్ణారావు తదితరులు గ్రామ, మండల, జిల్లా పరిషత్ స్థాయిల్లో సొంత వనరులు అభివృద్ధి, ఆర్థిక రాబడులపై వివిధ శాఖల అధికారులతో సమీక్షించారు. పంచాయతీరాజ్ చట్టం అమలు మేరకు గ్రామ, మండల, జెడ్పీ స్థాయిల్లో సొంత వనరులు ఏ విధంగా అభివృద్ధి చేసుకోవచ్చు, పన్నులు, పెండింగ్ బకాయిల వసూలుపై అధికారులకు అవగాహన కల్పించారు. కమిషన్ చైర్మన్ ఎస్.రత్నకుమారి మాట్లాడుతూ ఆస్తిపన్ను రాబడిలో ఇంటి పన్ను ప్రాముఖ్యమైందని, పన్ను వసూలు విషయంలో పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా పంచాయతీ కార్యదర్శులు పలు అంశాలను ప్రస్తావించారు. వారు సూచించిన సమస్యలు, అంశాలను ప్రభుత్వానికి నివేదిస్తామని కమిషనర్ రత్నకుమారి తెలిపారు. అలాగే ప్రచారపు పన్ను, ఇతర పన్నులు, ఆక్షన్లు, ఫిష్ ట్యాంక్ వేలం తదితర రాబడిని పెంచే వాటిపై తీసుకున్న చర్యలు, అవలంబిస్తున్న కొత్త సూచనలను సభ్యుల నుంచి సేకరించారు. సమావేశంలో జెడ్పీ సీఈవో ఎ.శ్రీరామచంద్రమూర్తి, కాకినాడ జిల్లా డీపీవో భారతి సౌజన్య తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జెడ్పీ చైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావు

భక్తులతో రత్నగిరి కిటకిట

అన్నవరం: రత్నగిరిపై సత్యదేవుని ఆలయం బుధవారం వేలాదిగా విచ్చేసిన భక్తులతో కిటకిటలాడింది. కొండపై మంగళవారం రాత్రి, బుధవారం తెల్లవారుజామున పెద్దసంఖ్యలో వివాహాలు జరిగాయి. నవ దంపతులు, వారి బంధుమిత్రులు సత్యదేవుని వ్రతాలాచరించి స్వామివారిని దర్శించారు. ఇవే ముహూర్తాలలో రాష్ట్రంలోని పలు చోట్ల కూడా వివాహాలు చేసుకున్న నవ దంపతులు, వారి బంధువులు కూడా సత్యదేవుని సన్నిధికి తరలివచ్చారు. వీరంతా సత్యదేవుని వ్రతాలాచరించి స్వామివారిని దర్శించారు. ఇతర భక్తులు కూడా సత్యదేవుని ఆలయానికి తరలి రావడంతో ఆలయ ప్రాంగణం కిటకిట లాడింది. స్వామివారి వ్రతాలు 1,500 జరిగాయి. సుమారు 30 వేల మంది భక్తులు సత్యదేవుని దర్శించగా అన్ని విభాగాల ద్వారా దేవస్థానానికి రూ.30 లక్షలు ఆదాయం వచ్చినట్లు అధికారులు తెలిపారు. సత్యదేవుని నిత్యాన్నదాన పథకంలో నాలుగువేల మంది భక్తులకు భోజనం పెట్టారు.



సత్యదేవుని వ్రతాలాచరిస్తున్న భక్తులు

నేడు నిజరూప దర్శనం

రత్నగిరి వాసుడు సత్యదేవుడు, అనంతలక్ష్మీ సత్యవతీదేవి అమ్మవారు, శంకరుడు గురువారం ఏ విధమైన అలంకరణలు లేకుండా శిలారూపంగా భక్తులకు నిజరూప దర్శనం ఇవ్వనున్నారు.